క్లుప్తంగా

ఎస్పీని కలిసిన సబ్‌కలెక్టర్


ఎస్పీకి పూల బొకే అందజేస్తున్న సబ్‌కలెక్టర్

ఆదోని రూరల్: ఆదోనిలోని పోలీసు అతిథిగృహంలో జిల్లా ఎస్పీ బిందు మాధవ్‌ను బుధవారం ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పూలమొక్క అందజేసి మర్యాదపూర్వకంగా కలిశారు. గణేష్ నిమజ్జన ఉత్సవ ఏర్పాట్లపై చర్చించారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

పెద్దకడుబూరు : గర్భిణులు నాణ్యమైన పౌష్టికాహారాన్ని తీసుకోవడం వల్లనే పుట్టబోయే శిశువులు ఆరోగ్యవంతంగా ఉంటారని మెడికల్ ఆఫీసర్ సుశ్మిత అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని హెచ్.మురవణి గ్రామం అంగన్‌వాడీ -1లో బుధవారం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం వల్ల ఉపయోగాలు, లోపిస్తే కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ శ్రీధర్, ఎంఎల్‌హెచ్‌పీ సోమేశ్వరి పాల్గొన్నారు.

మాజీ జెడ్పీటీసీకి పరామర్శ


మంగమ్మను పరామర్శిస్తున్న వై. ప్రదీప్ రెడ్డి

కోసిగి: వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు, మాజీ జెడ్పీటీసీ మంగమ్మపై హత్యాయత్నం జరగడం బాధాకరమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై. ప్రదీప్ రెడ్డి అన్నారు. బుధవారం ఆదోని మధు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న మంగమ్మను పరామర్శించారు. ఆమె ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆమె ఐసీయూలో ఉందని కత్తి గాయం అయిన చోట ఆపరేషన్ చేసినట్లు వైద్యులు వివరించారు. ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈమేరకు ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ఆమెతో ఫోన్‌లో మాట్లాడి ఆరోగ్య విషయం అడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వైఎస్సార్ సీపీ కోసిగి మండల నాయకులు నాడుగేని నరసింహులు, మాజీ ఎంపీపీ భీమక్క ఉన్నారు.

మాదిగల అభివృద్ధికి పాటుపడదాం

కౌతాళం: మాదిగల చైతన్యానికి, అభివృద్ధికి పాటుపడాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గాప్ప, సీనియర్ నాయకుడు ఆనంద్‌రాజు అన్నారు. బుధవారం స్థానిక కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గుడికంబాలి ఆనంద్, ఉపాధ్యక్షుడిగా కురవల్లి విజయ్‌కుమార్, ఏరిగేరి వీరేష్, ప్రధాన కార్యదర్శిగా రమాంజనేయులు అధికార ప్రతినిధులుగా చిన్న, తోవి ఈరన్న, కోశాధికారిగా రేవన్న, సహాయ కార్యదర్శిగా చంద్రశేఖర్‌లను ఎన్నుకున్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి ఉద్యమం

ఎమ్మిగనూరుటౌన్: రైతులు, కౌలు రైతుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఉద్యమించక తప్పదని రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతు, మండల అధ్యక్ష,కార్యదర్శులు నరసింహులు, లక్ష్మీనర్సయ్య అన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. సీఎం చంద్రబాబు నాయుడు పెట్టుబడి సాయం కింద రైతులకు ఏటా రూ.20వేలు ఇస్తామని చెప్పి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ నేటికి అమలు చేయలేదన్నారు. దీంతో పంట సాగు కోసం రైతులు అప్పులు చేసి ఇబ్బందులు పడుతున్నారన్నారు.

లింగాకర్షక బుట్టలతో గులాబీ పురుగు నివారణ


లింగాకర్షక బుట్టలు పంపిణీ చేస్తున్న జేడీ

గోనెగండ్ల: పత్తి పంటలో గులాబీ రంగు పురుగు నివారణకు లింగాకర్షక బుట్టలే మేలని వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి అన్నారు. బుధవారం మండల పరిధిలోని హెచ్.కైరవాడి గ్రామంలో 20 ఎకరాల్లో నిర్వహించిన పత్తి పంట ప్రదర్శన క్షేత్రంలో గులాబీ రంగు పురుగు నివారణపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. లింగాకర్షక ఎర బుట్టలను ఏడీ మహమ్మద్ ఖాద్రీతో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీటీఎం చక్రవర్తి నాయక్, ఏఓ హేమలత తదితరులు పాల్గొన్నారు.

ఇటుక బట్టీలపై చర్యలు తీసుకోండి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణానికి వచ్చే ప్రధాన రహదారుల పక్కనే ఉన్న ఇటుకల బట్టీలపై చర్యలు తీసుకోవాలని రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు పంపణ్ణగౌడ్, సీపీఐ నాయకుడు భాస్కర్ యాదవ్ కోరారు. బుధవారం డిప్యూటీ తహసీల్దార్ శ్రీదేవికి వినతి పత్రం ఇచ్చారు. కొండమ్మ చెరువు వద్ద ఇటుకల బట్టీలు పెట్టడంతో సమీపంలోని పంటలు బూడిదమయి రైతులు నష్టపోతున్నారన్నారు. చిన్నన్న, రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం


బుట్టా రేణుక, వైఎస్సార్‌సీపీ ఎమ్మిగనూరు ఇన్‌చార్జ్

- ముందే తెలిసినా మేలుకోకపోవడం వల్లే విజయవాడ విపత్తు
- పబ్లిసిటీ కోసం సహాయకచర్యల్లో టీడీపీ నేతల ఓవరాక్షన్
- రిటైనింగ్ వాల్ వల్ల పలు ప్రాంతాలకు తప్పిన ముప్పు
- వైఎస్సార్‌సీపీ ఎమ్మిగనూరు ఇన్‌చార్జ్ బుట్టా రేణుక

ఎమ్మిగనూరు: విజయవాడ వరద బాధితులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందని కర్నూలు మాజీ పార్లమెంట్ సభ్యురాలు, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఎమ్మిగనూరు ఇన్‌చార్జ్ బుట్టారేణుక అన్నారు. బుధవారం ఆమె 'సాక్షి'తో మాట్లాడుతూ అధికార యంత్రాంగం భారీ వర్షాల సమాచారంతో హెచ్చరించినా ప్రభుత్వం మేలుకోకపోవడం ప్రజలకు శాపంగా మారిందన్నారు. అధికార యంత్రాంగం, పాలనా వ్యవస్థలు పటిష్టంగా ఉన్న రాష్ట్ర రాజధాని పరిసర ప్రాంతమైన విజయవాడలోనే వరదలపై అప్రమత్తం చేయడంలో ప్రభుత్వ వైఫల్యం చూస్తుంటే రాష్ట్రంలో పరిస్థితులు ఎలా ఉంటాయో తేటతెల్లమవుతోందన్నారు. రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ, బుడమేరుకు భారీగా వరదనీరొస్తుందని నీటిపారుదలశాఖ హెచ్చరించినా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించటంతో ఇంతటి విపత్తు దాపురించిందన్నారు. ఫలితంగా విజయవాడలోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమై భారీగా ఆస్తి, ప్రాణ నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. వరదొస్తుందని ముందుగా తెలిసినా ప్రజలను అప్రమత్తం చేయలేకపోయామని సాక్షాత్తు ఓ ప్రభుత్వ అధికారే పేర్కొన్నారంటే ప్రభుత్వ వైఫల్యం ఏపాటిదో తెలుస్తోందన్నారు. కనీసం వరదబాధితులను ఆదుకోవటంలోనూ ప్రభుత్వ వైఫల్యాలే అడుగడుగునా కనిపించాయన్నారు. మూడు రోజులపాటు ఆహారం, నీళ్ల దొరక్క వరదబాధితులు ఆక్రందనలు చేయటం బాధాకరమన్నారు. పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయలేక పోవడం ప్రభుత్వ వైఫల్యం కాదా అని ప్రశ్నించారు. నేటికీ వరదబాధితులకు పూర్తిస్థాయిలో నిత్యావసర సరుకులను కూడా అందించకపోవటం శోచనీయమన్నారు. సర్వం కోల్పోయిన వరద బాధితులకు ఆర్థిక సహాయం అందిస్తామన్న భరోసా కూడా చంద్రబాబు ప్రభుత్వం ఇవ్వకపోవడం విచారకరమన్నారు. వరద సహాయక చర్యల్లో టీడీపీ ఓవర్ యాక్షన్ వారి పబ్లిసిటి పిచ్చి పరకాష్టకు నిదర్శనని, దీనివల్ల ప్రజలకు ఎటువంటి మేలు జరగలేదన్నారు. విజయవాడలోని కృష్ణలంక ప్రాంతంలో గతంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రిటైనింగ్ వాల్ కట్టించటం వల్లే పలుప్రాంతాలకు ముప్పు గండం తప్పిందన్నారు. విపత్తుల్లో అధికార యంత్రాంగానికి పూర్తి స్వేచ్ఛ ఇస్తే వాళ్లు తమపనిని తాము చేసుకుపోతారని, మంత్రులు పబ్లిసిటీ యావలో వాళ్ల విధులకు అడ్డంకిగా మారకూడదన్నారు. జరిగిన నష్టాన్ని దృష్టిలో ఉంచుకొని వరద బాధితులను ఉదారంగా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.


వేలం పాటలో హుండీని దక్కించుకున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు మహేందర్‌రెడ్డి, ఆర్థోపెడిక్ డాక్టర్ విజయ్‌కుమార్


గణనాథుని రథసారథిగా మారిన ఎమ్మెల్యే పార్థసారథి


ఎల్లెల్సీ కాలువ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ బిందుమాధవ్


రహదారిలో భక్తులకు ప్రసాదం, నీటిని అందిస్తున్న రెడీమేడ్ షోరూమ్ నిర్వాహకులు


వీరహనుమాన్ వినాయకుడు

గంగమ్మ ఒడికి పార్వతీ తనయుడు

- భక్తజనుల మధ్య వైభవంగా నిమజ్జనోత్సవం
- పూజలు చేసి ఉత్సవాలను ప్రారంభించిన ఎమ్మెల్యే పార్థసారథి
- ఆలస్యంగా ప్రారంభమైన శోభాయాత్ర

ఆదోని సాక్షి నెట్‌వర్క్: పట్టణంలో లంబోదరుడి నిమజ్జనోత్సవం భక్త జనుల మధ్య బుధవారం కనుల విందుగా సాగింది. భక్త జనుల జైకారాలు, ఆనందోత్సవాల మధ్య సాయంత్రం 6 గంటలకు ప్రారంభమైన నిమజ్జనోత్సవం గురువారం ఉదయం 6 గంటల వరకు కొనసాగింది. ప్రధాన రహదారిలోని విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో గణేష్ ఉత్సవ కమిటీ నేతృత్వంలో కొలువుదీరిన ఉంద్రాలయ్యకు ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, ఉత్సవకమిటీ సభ్యులు, పట్టణ ప్రముఖులు ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జనోత్సవాన్ని ప్రారంభించారు. అంతకముందు వినాయకుడి ప్రసాదంగా ఉంచిన లడ్డూ, హుండీకి ఉత్సవ కమిటీ పెద్దలు వేలం నిర్వహించారు. లడ్డూ ప్రసాదాన్ని వేలం నిర్వహించగా వైఎస్సార్‌సీపీ నాయకుడు మహేందరెడ్డి రూ.1.75 లక్షలకు కైవసం చేసుకున్నారు. అదే విధంగా ఆర్థోపెడిక్ డాక్టర్ విజయ్‌కుమార్ రూ.2.10 లక్షలకు హుండీని దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు హెగ్గటి ప్రసాద్, విట్టా రమేష్, చంద్రకాంత్‌రెడ్డి, దేవిశెట్టి ప్రకాష్, ఎండీ బసవరాజు, మారుతరావు, కునిగిరి నీలకంఠ తదితరులు పాల్గొన్నారు.

తుంగభద్ర దిగువ కాలువలో నిమజ్జనం

చిన్నహరివాణం సమీపంలోని తుంగభద్ర దిగువ కాలువ వద్ద ఏర్పాటు చేసిన వినాయకఘాట్‌లో సంప్రదాయబద్ధంగా సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్, ఎమ్మార్వో శివరాముడు, ఎంపీడీఓ గీతావాణి, ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, ఉత్సవకమిటీ సభ్యులు పూజలు నిర్వహించి నిమజ్జనోత్సవానికి అంకురార్పణ చేశారు. సాయంత్రం 6 గంటల నుంచి పట్టణంలోని ఆయా వీధుల్లో కొలువుదీరిన 400కు పైగా గణపయ్యలకు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం నిమజ్జనోత్సవాలకు శ్రీకారం చుట్టారు. శుభ ముహూర్తం కోసం మండప నిర్వాహకులు చాలామంది సాయంత్రం వరకు వేచి విగ్రహాలను కదిలించారు. దీంతో విగ్రహాల ఊరేగింపు ముఖ్యమైన పాత బస్టాండు కూడలి చేరుకోవడానికి 8 గంటలు పట్టింది. విగ్రహాలన్నీ ఒకే చోటుకు చేరుకోవడంతో పాత బస్టాండు కూడలి భక్తజన సంద్రంగా మారింది. నిమజ్జనోత్సవంలో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు లింగ బేధం లేకుండా మేళతాళాలు, డోలు శబ్దాలు, డీజేలకు అనుగుణంగా ఆధ్యాత్మిక ఆనందంతో మైమరిచి నృత్యం చేశారు. బాణసంచా పెద్ద ఎత్తున పేల్చారు.


పట్టణంలో విగ్రహాల శోభాయాత్ర

దాహార్తి తీర్చిన దాతలు

వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఫొటో స్టూడియో నిర్వాహకులు, జిల్లా జంగమ సంఘం సభ్యులు, రెడిమేడ్ షోరూమ్, శారీస్ సెంటర్ నిర్వాహకులు దాహార్తి తీర్చేందుకు, ప్రసాదం అందించేందుకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారు. అంతేగాకుండా పులిహోర, చిత్రన్నం, షర్‌బత్, ఉగ్గాని బజ్జీలు, ఉప్మ పంపిణీ చేశారు.

భారీ బందోబస్తు

పట్టణం సున్నిత సమస్యాత్మక ప్రాంతం కావడంతో ఉత్సవాలకు జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాల మేరకు డీఎస్పీ సోమన్న ఆధ్వర్యంలో 508 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. నిమజ్జనోత్సవ ఏర్పాట్లను జిల్లా ఎస్పీ బిందు మాధవ్‌తో పాటు ఎమ్మెల్యే పార్థసారథి దగ్గరుండి పర్యవేక్షించారు. పోలీసు సిబ్బందికి సూచనలిచ్చారు. అనంతరం చిన్నహరివాణం ఎల్లెల్సీ కాలువ వద్దకు చేరుకుని వినాయకుల నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. చిన్నహరివాణం ఎల్లెల్సీ కాలువ వద్ద క్రేన్‌ల ద్వారా వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేలా అధికారులు చర్యలు తీసుకున్నారు.

బై బై.. వినాయక

కోసిగి: మండల కేంద్రం కోసిగిలో కొలువుతీరిన గణనాథుల నిమజ్జన వేడుకలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. కోసిగిలో వైఎస్సార్ సర్కిల్, శ్రీరామనగర్, సిద్దప్ప పాళెం, ఆంజనేయ స్వామి, కాళికాదేవి, గీతామందిరం, సూగరప్ప దేవాలయం, ఈశ్వర దేవాలయం, మారెమ్మ దేవాలయం సమీపాలలో కొలువుతీరిన గణనాథులను ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. గీతామందిరం దగ్గర కొలువు తీరిన గణపతి ఊరేగింపులో మహారాష్ట్ర రాష్ట్రం నాసిక్ నుంచి వచ్చిన కళాకారుల డోలు వాయిద్యాలు ఆకర్షణగా నిలిచాయి. మధ్యాహ్నం నుంచి మేళతాళాలు, కలశాలతో పురవీధుల గుండా ఊరుగింపుగా బయలు దేరి మాధవరం గ్రామ సమీపంలో తుంగభద్ర నదిలో నిమజ్జనం చేశారు. ఎస్ఐ చంద్రమోహన్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.


ఎల్లెల్సీ కాలువలో గణనాథులను నిమజ్జనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి, వీహెచ్‌పీ, ఉత్సవ కమిటీ సభ్యులు

గంగ ఒడిలో చేరిన గణనాథుడు

మంత్రాలయం : నియోజకవర్గ కేంద్రంలో కొలువుదీరిన గణనాథులు బుధవారం రాత్రి గంగమ్మ ఒడిలో చేరారు. ఎమ్టీఆర్ కాలనీలో కొలువుతీరిన వరసిద్ధ వినాయక స్వామి, రాఘవేంద్ర, నగర్, రామచంద్ర నగర్, పాత ఊరిలో కొలువుతీరిన గణనాథులకు చివరి పూజలు చేసి ప్రత్యేక అలంకరించి ట్రాక్టర్‌లపై కొలువుంచి రాఘవేంద్ర సర్కిల్ మీదుగా తుంగభద్ర నది ఒడ్డుకు చేర్చారు. అక్కడ విగ్రహాలను నిమజ్జనం చేశారు. అలాగే మండలంలో కాచాపురం గ్రామంలో భీమా యూత్ ఆధ్వర్యంలో కొలువుతీరిన స్వామి వారికి వైఎస్సార్ సీపీ మండల నాయకులు మురళీ మోహన్ రెడ్డి, ఉమేష్ రెడ్డి హారతి పట్టి ప్రత్యేక పూజలు చేసుకున్నారు. సీఐ రామాంజులు, ఎస్ఐ పరమేష్ నాయక్‌ల ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.


మంత్రాలయంలో నిమజ్జనానికి వెళ్తున్న గణనాథుడు


తోవిలో గణనాథుల ఊరేగింపు

వైభవంగా గణేష్ నిమజ్జనం

కౌతాళం: మండలంలో బుధవారం ఐదవ రోజు గణేష్ నిమజ్జన కార్యక్రమం వైభవంగా కొనసాగింది. మండల పరిధిలోని తోవి, బదినేహాల్,, కుంటనహాల్, ఉప్పరహాల్, రౌడూరు, లింగాలదిన్నె, నదిచాగి, కాత్రికి, వల్లూరు, మరళి గ్రామాల్లో కొలువైన గణేష్ విగ్రహాలను సాయంత్రం నాలుగు గంటల నుంచి యువకుల నృత్యాలు, మేళతాలు, డప్పువాయిద్యాల నడుమ పూర వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. బదినేహాల్ గ్రామంలో సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్తమ నాట్య ప్రదర్శనకు గ్రామ సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకుడు వీరభద్రగౌడ్ బహుమతులు ప్రదానం చేశారు. ఆయా గ్రామల్లో గ్రామ నాయకులు కమిటీ నిర్వహకుల ఆధ్వర్యంలో తుంగభద్ర నదిలో, దిగువ కాలువలో నిమజ్జనం చేశారు. సీఐ అశోక్‌కుమార్ కుంటనహాల్‌లో, మంత్రాలయం సీఐ రామాంజినేయులు నదిచాగిలో గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించారు.


కాచాపురం గణేషుడికి హారతి పడుతున్న వైఎస్సార్ సీపీ మండల నాయకులు


ఊరేగింపులో పాల్గొన్న ఉత్సవకమిటీ, వీహెచ్‌పీ నాయకులు


కోసిగిలో డోలు వాయిస్తున్న మహారాష్ట్ర నాసిక్ కళాకారులు


గణనాథులను వీక్షించేందుకు రహదారుల్లో కూర్చొన్న ప్రజలు

సాగునీటి విషయంలో రాజకీయం తగదు

ఎమ్మిగనూరుటౌన్: సాగునీటి విషయంలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి రాజకీయం చేయడం తగదని, రాజకీయాలను పక్కన పెట్టి రైతులకు సాగు నీరందించాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఎల్లెల్సీ మాజీ డైరెక్టర్ గడ్డం నారాయణరెడ్డి సూచించారు. బుధవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ఎమ్మెల్యే మీడియా సమావేశంలో గురురాఘవేంద్ర ఎత్తిపోతల స్కీం కింద టీడీపీ హయాంలోనే సాగునీరు అధికంగా పారించినట్లు రైతులను మభ్యపెట్టే విధంగా మాట్లాడటం సమంజసం కాదన్నారు. 2014 నుంచి 2019 వరకు పూలచింత స్కీం కింద గత టీడీపీ హయాంలో 3,500 ఎకరాలకు సాగు నీరందించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారని, అయితే అధికారిక లెక్కల ప్రకారం కేవలం 1258 ఎకరాలని, అదేవిధంగా చిలకల డోణ స్కీం కింద కేవలం 69 ఎకరాల్లో సాగునీరందిస్తే 2,800 ఎకరాలకు నీరు పారించామని ఎమ్మెల్యే చెప్పుకుంటున్నారని వెల్లడించారు. అదేవిధంగా సోగనూరు స్కీం కింద 418 ఎకరాలకు నీరందిస్తే 3,900ల ఎకరాలకు నీరిచ్చామని ఎమ్మెల్యే పేర్కొనడం సమంజసం కాదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 2019 నుంచి 2024 వరకు పూలచింత స్కీం కింద 1,463 ఎకరాలకు, చిలకల డోణ స్కీం కింద 1,170 ఎకరాలు, సోగనూరు స్కీం కింద 520 ఎకరాలకు సాగునీరందించడం జరిగిందని తెలిపారు. ఆర్‌టీఐ కింద సంబంధిత శాఖ అధికారులే ఈ లెక్కలు చూపుతూ తమకు సమాధానం ఇచ్చారన్నారు. గతంలో మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి రైతులకు సాగునీరందించారని, అలాగే నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇప్పించారని గుర్తు చేశారు. ఇటీవల తమ నాయకురాలు బుట్టారేణుక ఆయా స్కీంలను పరిశీలించి రైతులకు అవసరమైతే తాను సహాయసహకారాలు అందిస్తామని చెప్పారని తెలిపారు.


మాట్లాడుతున్న గడ్డం నారాయణరెడ్డి

జీఓ 21ని రద్దు చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: మోటారు వాహన చట్టంలోని జీఓ నంబర్ 21ని వెంటనే రద్దు చేసి ప్రైవేట్ సంస్థలకు అప్పగించిన డ్రైవింగ్ టెస్ట్, వాహనాల ఫిట్నెస్ సర్టిఫికెట్ల జారీ, వాహన రిజిస్ట్రేషన్లు చేసే ప్రక్రియను వెంటనే నిలిపి వేయాలని సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు గోవిందు, రాముడు డిమాండ్ చేశారు. బుధవారం ఏపీ ఆటో, ట్రాలీ, డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి, వినతి పత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్‌కు అందజేశారు. నాయకులు రాజు, రంగస్వామి, ఆది, ఖుద్దూస్, అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

నూతన విధానాన్ని నిలిపి వేయాలి

కోసిగి: ఆటోమెటిక్ సెన్సార్ టెస్టింగ్ ట్రాక్ సిస్టమ్‌తో వాహనాల ఫిట్నెస్ సర్టిఫికెట్ రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్ జారీ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ పరుశురామ్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు వెంకటేష్, చిన్నన్న, ముక్రయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం చెల్లించాలి

ఎమ్మిగనూరురూరల్: ప్రభుత్వం వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం చెల్లించాలని రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఏసేపు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని వర్షాలకు దెబ్బ తిన్న పంటలను ప్రజా సంఘాల నాయకులు పరిశీలించారు. వారు మాట్లాడుతూ చేతికి వచ్చిన పంట వర్షం రూపంలో నాశనం అయితే ప్రభుత్వం ఇంత వరకు ఎటువంటి పరిహారం ప్రకటించలేదన్నారు. పత్తి, మిరప, వేరుశనగ పంటలు వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్నాయని తెలిపారు. దెబ్బ తిన్న ప్రతి ఎకరానికి రూ. 20 వేలు పంట నష్ట పరిహారం ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు హనీఫ్, ఐపీవైఎల్ జిల్లా నాయకులు చిన్ని ప్రసాద్, యువజన నాయకులు నవీన్‌ఠాగూర్, బొంబాయి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

90 పనిదినాలు పూర్తి చేయాలి

నందవరం : గ్రామీణ ఉపాధి పనుల్లో భాగంగా గృహ నిర్మాణాల్లో 90 పని దినాలు పూర్తి చేయాలని ఏపీఓ శ్రీనివాసులు ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఉపాధి కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టీఏలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించి, 100 శాతం రాయితీ పొందేలా చూడాలన్నారు. సన్నకారు రైతులకు ఉద్యాన పంటల సాగుపై అవగాహన కల్పించాలన్నారు. అలాగే గ్రామాల్లో కొత్త పనులు గుర్తించాలని, రోడ్లకు ఇరుపైపులా కంప చెట్ల తొలగింపు, మొక్కలు నాటించడం వంటి పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఈసీ సూర్జహాన్, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

నందవరం : వివిధ దశలో పెండింగ్‌లో ఉన్న గృహ నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ దశరథ రామయ్య హౌసింగ్ అధికారులకు, సిబ్బందికి సూచించారు. బుధవారం మండల కేంద్రంలో హౌసింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. మండలంలో వివిధ దశలో ఉన్న ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించి నిర్మాణాలు చేపట్టాలన్నారు. లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాలకు డ్వాక్రా రుణం కింద రూ.30 వేలు మంజూరు చేస్తామని వివరించారు. హౌసింగ్ ఇన్‌చార్జీ ఏఈ గురుస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి నాయకుల నిర్వాకం.. నిమజ్జనం ఆలస్యం

ఆదోని అర్బన్: పట్టణంలో వినాయక ఉత్సవాలు గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిఏటా జరుగుతున్నాయి. మొదటగా విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో సభ్యులు ప్రతిష్టించిన వినాయక ప్రతిమకు పూజలు చేసి, ఊరేగింపుగా వెళ్లి ఎల్ఎల్‌సీ కాలువలో నిమజ్జనం చేసి నిమజ్జనోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించడం ఆనవాయితీ. అయితే కూటమి నాయకుల నిర్వాకం వల్ల ఈ ఏడాది నిమజ్జన కార్యక్రమం ఆలస్యంగా ప్రారంభమయ్యింది. ప్రతి ఏటా ఈ కార్యక్రమం ఉదయం 10 గంటల్లోపు జరుగుతుంది. అయితే కర్నూలు ఎంపీ నాగరాజు ఎమ్మెల్యేకు తెలియకుండా ఆదోనికి వచ్చారు. దీంతో టీడీపీ మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడుతో పాటు నాయకులు పెద్ద ఎత్తున విశ్వహిందూ పరిషత్ కార్యాలయం వద్దకు వచ్చి ఎంపీతో గణనాథునికి పూజలు నిర్వహించారు. కాగా, విశ్వహిందూ పరిషత్‌వారు ఎమ్మెల్యే పార్థసారథిని పిలవడం మరిచారు. పూజా కార్యక్రమాలు ముగించుకుని ఎంపీ కర్నూలుకు బయలుదేరి వెళ్లిన అనంతరం వీహెచ్‌పీ నాయకులు ఎమ్మెల్యే లేకపోతే బాగుండదని భావించి ఆయనను పిలిచారు. ఈ క్రమంలో ఉదయం 10 గంటల్లోపు గణేష్ నిమజ్జనం ప్రారంభం కావాల్సి ఉండగా, 11.30 గంటలకు ఎమ్మెల్యే వచ్చిన తరువాత ఊరేగింపు ప్రారంభించారు. దీంతో మధ్యాహ్నం 1;30 గంటకు ఎల్ఎల్‌సీ కాలువలో మొట్టమొదటి నిమజ్జనం ప్రారంభమయ్యింది.